# ఆరె పద్మజా చౌదరి

# నేను చేసింది తప్పా?

అప్పుడు నాకు ఆరేళ్ళు.

ప్రొద్దున్నే లేవగానే అమ్మ మెడ చుట్టూ చేతులేసి ఎత్తుకోమని మారాం చేసేవాణ్ణి. అమ్మ నవ్వుకుంటూ ఎత్తుకొని ముద్దు పెట్టుకునేది. ఒక్కొక్కసారి విసుక్కునేది.

అమ్మ అలా విసుక్కున్నప్పుడు నాన్నకు కోపం వచ్చేది. అయినా అమ్మను ఏమీ అనేవారు కాదు. ఆయన చూపుల్ని బట్టి ఆయనకి కోపం వచ్చిందని నేను గ్రహించుకునే వాణ్ణి.

అమ్మక్కూడా అర్థం అయ్యేది కానీ నాన్న కోపానికి భయపడేది కాదు. నాక్కూ భయం లేదు, కానీ నాన్నకు కోపం రావడం నాకిష్టం ఉండేది కాదు. ఎందుకంటే నాన్నకు కోపం రాదు. నాపైన అసలే రాదు.

అమ్మ నన్ను చిన్నతనంలో బాగా గారాం చేసింది. విసుక్కునేది కాదు. అల్లరి చేసినా మృదువైన కంఠంతో "అలా చేయవద్దు" అని చెప్పేది. అలాంటి అమ్మ రానురానూ కోపగించుకుంటోంది. అప్పుడప్పుడు నోటికి వచ్చినట్లు తిట్టేది. నాన్న వింటున్నారు అనుకుంటే అవి ఎక్కువౌతాయి.

ఎంత అలసి పోయి వచ్చినా నాన్న నన్ను ఎన్నడూ విసుక్కోలేదు. నాన్నను చూడగానే ఎదురెళ్ళి కాళ్ళకు చుట్టుకునే వాణ్ణి. నన్ను ఎత్తుకుని... తన గుండెలకు హత్తుకునేవాడు. మొదట్లో అమ్మ నవ్వేది. ఇప్పుడు అమ్మ మా ఇద్దరి వంకా మురిపెంగా చూడటం లేదు. పైగా నాన్న వచ్చే సరికి ఇంట్లోనే ఉండటం లేదు. అప్పుడు నాన్న డైనింగ్ టేబిల్ దగ్గరకు వెళ్ళి గిన్నెలమీద మూతలు తీసి చూసి, ముందు నాకు పెట్టి తర్వాత తను తినేవాడు. అమ్మ ఎప్పటికో వచ్చేది. పని మనిషి నాన్న రాగానే వెళ్ళి పోయేది.

ఆ మధ్య అమ్మ నాన్నా చీటికి మాటికి పోట్లాడుకుంటున్నారు. ఎప్పుడూ ఎవ్వర్నీ ఏమీ అనని నాన్న అమ్మతో రెండుసార్లు గట్టిగా మాట్లాడారు. అప్పుడు అమ్మ ఇంకా గట్టిగా అరిచింది...

"నా ఇష్టం" అంటూ గదిలోకి వెళ్ళి తలుపులు వేసుకుంది.

అప్పటి నుండి నాన్న మౌనంగా ఉంటున్నారు. అయినా నాన్న తప్పేం చెప్పాడు!" అలా ప్రొద్దుపోయే వరకూ తిరగొద్దు" అన్నారు. అంతేగా! చీకట్లో అమ్మ ఎలా వస్తుందో ఏమోనని మొదట్లో భయంతో నిద్రపోయేవాణ్ణికాదు.

ఒకసారి...

ఆ రాత్రి చాలా పొద్దుపోయింది. అమ్మను దార్లో దొంగలు ఏమీ చేయకూడదని భగవంతుణ్ణి ప్రార్థిస్తుండగా...

మా ఇంటి బయట కారు ఆగింది. అమ్మ గొంతు వినిపించింది. ఆనందం పట్టలేక నాన్నను లేపాను ఆశ్చర్యం!

నాన్న మెలకువగానే ఉన్నారు. కానీ, ఎందు చేతనో దొంగ నిద్రపోతున్నారు. లాభం లేదని నేనొక్కణ్ణే ముందు గదిలోకి వెళ్లాను... అమ్మకు ఎదురు...

అమ్మ దగ్గర రెండో తాళం చెవి ఉందిగా! తలుపు తెరిచింది. అప్పుడు చూశాను కారు దగ్గరే నిలబడి అమ్మనే చూస్తున్న అంకుల్ని నన్ను చూడగానే ఆయన కారెక్కి వెళ్ళిపోయారు.

"అమ్మా... ఆ అంకుల్ ఎవరు?" అన్నాను అమాయకంగా.

అమ్మ నన్ను గుడ్లురిమి చూసి, "పిచ్చి పిచ్చిగా వాగకు" అంది.

నా ముఖం చిన్నబోయింది. కళ్లు వాల్చుకొని గబగబా వచ్చి నాన్న గుండె మీద వాలిపోయాను. నాన్న రెండు చేతులూ నా చుట్టూ వేసి నన్ను మరింత దగ్గరకు తీసుకున్నారు. ఈ ప్రపంచంలో నాన్న స్పర్శకన్నా హాయిని కలిగించేది మరొకటి లేదు.

"నాన్న... ఆ అంకుల్" చెప్పబోయాను.

"ష్! అన్నారు నాన్న వారిస్తూ.

"ఈ విషయం ఎక్కడా ఎవ్వరితోనూ చెప్ప కూడదు" అన్నారు.

"అమ్మమ్మక్కూడానా?" అన్నాను.

నాకు ఆశ్చర్యం వేసింది. అమ్మమ్మక్కూడా చెప్పకూడని తప్పు అమ్మ చేస్తోందని మాత్రం అర్థం అయ్యింది.

ఆ తర్వాత్తర్వాత నాన్న ఆఫీసుకు వెళ్లినప్పుడు ఆరోజు రాత్రికార్లో అమ్మను తీసుకువచ్చిన అంకుల్ మా ఇంటికి రాసాగారు. నాతో స్నేహం చేయాలని చూశారుగానీ నేను సాగనీయలేదు. అమ్మ నన్ను ఎలాగైనా సరే ఆ అంకుల్ దగ్గర కూర్చో పెట్టాలని ప్రయత్నించింది కానీ వినలేదు. అమ్మ తిట్టింది నేను లెక్క చేయ లేదు.

ఆయన వెళ్ళిపోయాక...

"అంకుల్ ఎలా ఉన్నారు?" అంది.

"ఛీ... దొంగ" అన్నాను.

అమ్మ కోపంగా చూచింది. అప్పటి నుండి ఆ అంకుల్ వచ్చినప్పుడు పిలవటం మానేసింది. మళ్ళీ గనుక పిలిస్తే నేను ఆయన్ని "ఒరేయ్ దొంగాడా!" అందామనుకున్నాను.



చాలా సార్లు అంకుల్ విషయం నాన్నకు చెప్పాలి అనుకొని కూడా చెప్పలేదు. ఈ విషయం తెలిస్తే నాన్న బాధ పడతారని ఎందుకో నాకనిపించింది. ఎందు కనిపించిందో నాకు తెలియదు. నాన్న బాధ పడటం నాకిష్టం లేదు.

ఈ మధ్య అమ్మా నాన్న ఎక్కువగా మాట్లాడుకోవడం లేదు. ఒకవేళ మాట్లాడు కున్నా చివరకు అదీ పోట్లాటగా మారుతుంది. అమ్మ పెద్దగా అరుస్తుంది. అప్పుడిక నాన్న అదోలా చూసి ఊరుకుంటారు. నాకు ఇదంతా చూస్తే ఏడుపు వస్తుంది. మేం పూర్వంలా ఉండలేమా అనిపిస్తుంది.

ఆశ్చర్యం!

మంచం మీద నాన్న లేరు. నా రెండు కళ్ళూ విచ్చుకున్నాయి. నాకు భయం వేసింది. ఏడుపొచ్చింది. ఎందుకంటే నాన్న నాకన్నా ముందు లేవరు. నేనే ముందు లేచి నాన్నను లేపాలి. అది మా ఇద్దరి మధ్యా ఒప్పందం.

నాన్న ఒప్పందాన్ని అతిక్రమించారు

ఏమయ్యింది!

నాన్నేరి?

భయంతో బాధతో "నాన్నా" అని అరిచాను.

అల్లా ఉద్దీన్ అద్భుతదీపంలోకి రాక్షసునిలా మరుక్షణం నాన్న నా ఎదుట ప్రత్యక్షం అయ్యారు. చేతిలో అట్ల గరిట.

నాన్న అవతారం చూడగానే నాకు నవ్వొచ్చింది. పెద్దగా నవ్వాను. నాన్న నా దగ్గరకు వచ్చి నన్ను దగ్గరకు తీసుకుని నవ్వారు. అలా నవ్వుతూ నవ్వుతూ ఉంటే నాన్నకళ్ళలో నీళ్ళు.

నాకు అనుమానం వచ్చింది. నాన్న ఏడుస్తున్నారేమో నని,

అదే అడిగాను.

నాన్న పెద్ద పెట్టున శబ్దం చేశారు. అది నవ్వో ఏడుపో నాకు ఇప్పటికీ అర్థం కాలేదు.

నాన్న బ్రష్ చేయించారు. స్నానం చేయించి క్రొత్త డ్రెస్ వేశారు. అంత క్రొత్త డ్రెస్ వేస్తుంటే ఆనందం, ఆశ్చర్యం రెండూ కలిగాయి. అది క్రొత్తదని నాన్నకు తెలిసి ఉండదు. తెలిస్తే వేరేది వేసుకో మంటారు. అయినా చెప్పేశాను... నాన్నతో అబద్ధం ఆడటం నాకిష్టం ఉండదుకాబట్టి.

నాన్న అదోలా నవ్వి "నాకు తెలుసు అన్నారు."

చాలా సేపటికి "మీ అమ్మకోసం ఏడ్వకుండా ఉంటే నీకు చాలా క్రొత్త డ్రెస్సులు, బాల్సు, బొమ్మలు కొంటాను" అన్నారు.

నాకిదేమిటో అర్థం కాలేదు. అప్పుడడిగాను. "అమ్మేది?" అని. అప్పుడప్పుడు అమ్మ ఇంటికి రాకుండా ఉండటం చేత, నేను అప్పటివరకూ అమ్మను అడగలేదు.

అప్పుడు నాన్ననాకు ఏమిటేమిటో చెప్పారు. అన్నీ పొంతనలేని కబుర్లు. అయినా నేను ఇంకేమీ ప్రశ్నించలేదు. ముందే చెప్పానుగదా, నాన్న బాధ పడ్తే చూడలేనని. అమ్మరాకుండా చాలా రోజులు గడచిపోయాయి.

నాన్నే రోజూ వంట చేస్తున్నారు. నాన్నకు అమ్మలా వంట చెయ్యటం రాదు. అయినా నేను బాగా చేస్తున్నారని చెప్పాను. అంతకు ముందులా నాన్న ఆలశ్యంగా రావడం లేదు. ఎంచక్కా నన్ను తీసుకొని షికారుకో, సినిమాకో వెళ్తున్నారు. ఇలాంటప్పుడు అమ్మ లేక పోతేనే హాయి అనిపించేది. అయినా అమ్మంటే నాకిష్టం. అమ్మను చూడాలని ఎన్నిసార్లో అనుకున్నాను.

మరి అమ్మకి నన్ను చూడాలని పించలేదా?

అనిపిస్తే రావచ్చు కదా!

ఇలా అనిపించగానే నాకు ఏడుపొచ్చింది. అయినా నేనెప్పుడూ నాన్న చూసేలా ఏడ్వలేదు. కారణం మీకూ తెలుసు.

కొన్ని రోజులకు ఎలా తెలిసిందో అమ్మమ్మ వచ్చింది. ఏడ్చింది అమ్మను తిట్టింది. నాన్న ఇదంతా మౌనంగా విన్నారు.

"దాన్ని తిట్టనన్నా తిట్టవేమయ్యా?" అంది అమ్మమ్మ

"తిడితే ఏమొస్తుంది?" అన్నారు నాన్న.

అమ్మమ్మ తనతో నన్ను తీసుకు వెళ్తానంది. నన్ను పెంచుతానంది. నాన్నను మళ్ళీ పెళ్ళి చేసుకోమంది.

నాన్న "ఛీ" అన్నారు. నా తల నిమురుతూ, "వీణ్ణి వదిలి నేను బ్రతకలేను" అన్నారు.

అమ్మమ్మ వెళ్ళి పోయింది.

నేనూ నాన్నా, అమ్మలేకుండా ఉండటానికి

అలవాటు పడ్డాం. నాన్న మెల్లగా వంట బాగా చేయడం నేర్చుకున్నాక, అన్నీ నాకిష్టమైనవే చేస్తారు. అమ్మలా ఏదీ బలవంతంగా పెట్టరు.

నాన్నకు నాతోనే లోకం అయ్యింది. నాకూ అంతే. ముందులా అమ్మ గుర్తురావడం లేదు. అంటే మేం అమ్మను మర్చిపోలేదు. మొదట్లోలా అమ్మ గుర్తురాగానే ఏడుపు రావడం లేదు. అమ్మ లేకుండా బతకడంలో కూడా ఆనందాన్ని పుట్టించుకునే ప్రయత్నంలో ఉన్నాం. అమ్మ వెళ్ళి ఎన్నాళ్ళయిందో కూడా లెక్కేసుకోడం మానేశాం.

అలాంటి పరిస్థితుల్లో ఒక తెల్లవారు జామున హఠాత్తుగా అమ్మ ఊడి పడింది. నేను నా కళ్ళను నమ్మలేక పోయాను. మళ్ళీ మళ్ళీ చూశాను. అమ్మ వెనుక అమ్మమ్మ, తాత, బాబాయి, మామయ్య, పిన్ని. నేను నాన్నను పిలుచుకు వచ్చాను.

"నువ్వా?" అన్నారు నాన్న.


అమ్మ తల దించుకుంది.

నాకు అమ్మను అలా చూస్తుంటే కోపం వచ్చింది.

మెల్లగా అందరూ మాట్లాడసాగారు. నాన్న మాత్రం ఎప్పట్లా మౌనం వహించారు. నాన్న మౌనం చూసి అమ్మ రెచ్చిపోయింది. నాన్న తప్పుల్ని గుర్తు చేయ సాగింది.

అందరూ నాన్నకేదో నచ్చి చెబుతున్నారు. అమ్మకు బుద్ధులు చెప్తున్నారు. అమ్మ వినిపించుకోవటం లేదు. ఎప్పట్లా అరుస్తోంది. తప్పంతా నాన్నదేనని చెబుతోంది. తనే పాపం ఎరుగనంటోంది.

బుద్ధుడిలా కూర్చున్న నాన్నని చూస్తుంటే నాకు అమ్మ మీద కోపం అధికమయ్యింది. అమ్మ చెప్పేవన్నీ అబద్ధాలని అరవాలనిపించింది. అంకుల్ విషయం అందరికీ చెప్పాలనిపించింది. అయినా, నాన్న కష్టం ఉండదని ఊరుకున్నాను.



● నేను పరీక్షల్లో కాపీ కొట్టి పాసయ్యేదాన్ని.

● రిషీకపూర్ నా తొలి హీరో చాలా సరదాగా ఉండేవాడు.

● ప్రిన్స్ ఛార్లెస్ ఇండియా వచ్చినప్పుడు నేనతన్ని ముద్దు పెట్టుకుంటే అందరూ నన్ను అవమానించారు. ఇందులో తప్పేముంది. వారి సంప్రదాయ ప్రకారం నేను అతన్ని ఆహ్వానించానంతే.

● నేనెక్కువగా మిధున్‌తో నటించాను. అది ఇద్దరి అదృష్టమంటాడతను.

● మా బావ 'శక్తి కపూర్' అంటే మా అబ్బాయికి చాలిష్టం. వాడు శక్తి ఫాన్.

● నన్నెప్పుడూ మా తల్లిదండ్రులు డబ్బులడగ లేదు.

● నాకు మాధురీదీక్షిత్ అంటే చాలిష్టం. ఎందుకంటే నాకు లాగా ఆమె కూడా మహారాష్ట్రకి చెందినదే. ఆమెను చూస్తే నాకు గర్వంగా ఉంటుంది.

మెల్లగా వెళ్ళి నాన్న ఒళ్ళో కూర్చున్నాను. అమ్మ పిలిచినా వెళ్ళలేదు. నాన్న నన్ను గట్టిగా హత్తుకొని నా చెవిలో నాకు మాత్రమే వినిపించేలా చెప్పారు జీరపోయిన కంఠంతో... "నీకోసం నాన్నా... ఇంత అవమానం దిగమింగుతున్నాను" అని.

నాన్న దిగమింగే అవమానం ఏమిటి?

అమ్మ.

అవును! అమ్మ.

నాకు అమ్మ మీద కోపం పదిరెట్లు పెరిగింది. నాకోసం నాన్న అవమానాల్ని భరించనక్కర్లేదు. ఈ విషయం ఎలా చెబితే ఆయనకు అర్థం అవుతుంది!

ఇంతలో పెద్దవాళ్ళు పెద్దగా మాట్లాడుకోసాగారు. అందరి మధ్యా అమ్మకంఠం తారాస్థాయిలో ఉంది.

"నువ్వే... నీ మూలానే నాకీ అవస్థ. మొదటినుండీ నన్ను అనుమానిస్తూనే వచ్చావు. అలాగే ప్రచారం చేశావు. భరించలేక వెళ్ళిపోయాను. చద్దామనుకున్నాగానీ పిల్లాడు గుర్తుకొచ్చి చావలేక... వస్తున్నాను. నువ్వే నన్ను బజారు కీడ్చావు" అమ్మ ఇలా ఏవేవేమిటో అంటోంది.

నేను నాన్న దగ్గర్నుండి లేచి వెళ్ళటం ఎవ్వరూ చూడలేదు. నేను వంటింట్లోకి వెళ్ళి పచ్చడి నూరుకునే బండ తెచ్చాను. ఎవరన్నా చూసేలోపే అమ్మ దగ్గరకు వెళ్ళి నెత్తిమీద బలంగా వేశాను.

"అమ్మా" అంటూ అమ్మ పడిపోయింది. అంతా రక్తం గందరగోళం. ఎవరో నన్ను కొట్టబోయారు. నాన్న గబ గబా వచ్చి నన్నెత్తుకున్నారు. పోలీసులొచ్చారు. అమ్మను హాస్పిటల్ తీసుకువెళ్ళారు. నాన్న పోలీసులతో "నేనే" చేశాను అని చెప్పారు. నాన్న అబద్ధం చెప్పటం నాకు నచ్చలేదు. అందుకని నేను నిజం చెప్పేశాను. చాలా రోజుల నుండి నేనీ బాల నేరస్థుల బడిలోనే ఉన్నాను. నాన్న బడి అని చెప్పారు కానీ నాకు మాత్రం జైలులా ఉంది. మొదటి సారి నన్నిక్కడ వదిలేటప్పుడు నాన్న ఏడ్చారు. అమ్మకేమయ్యిందో తెలియలేదు. "నాన్నను అడిగితే "వస్తుంది" అన్నారు. కానీ ఇంత వరకూ రాలేదు. నామీద కోపమేమో అనుకుంటే మా బళ్ళో పెద్దన్న అమ్మ చచ్చిపోయింది అన్నాడు. అప్పుడు నేను గట్టిగా ఏడ్చాను. "నేను తప్పు చేశానా!" అనుకున్నాను. □□

